
# సీరియల్ వైరస్

యస్వీకృష్ణ



''ట్రింగ్‌గ్‌గ్...''

అలారం చప్పుడు చెవులగుండా పాకి గుండెల మీద దభీదభీమని జారుతున్నట్లుగా అన్పిస్తూ వినిపించడంతో దిగ్గున లేచి కూర్చుని కళ్లు నులుముకొని చూసింది శ్రీలక్ష్మి.

ఆరు గంటలు!! "అమ్మో... అప్పుడే ఆరయ్యిందా? ఇక క్షణం కూడా ఆలస్యం చేయకూడదు!" అనుకుంటూ గబగబా లేచి కిచెన్‌లోకి పరిగెత్తింది. రెండే రెండు నిమిషాల్లో బెడ్‌కాఫీ తయారు చేసుకొచ్చి బెడ్రూంలోకి రయ్‌న జొరబడింది. నిండా దుప్పటి ముసుగేసుకొని పడుకున్న భర్తను చూసి చేతిలోని కాఫీ కప్పును పక్కన బెట్టి-బకెట్లో బట్టలు జాడించినట్లు తట్టి(కొట్టి) లేపింది.

"ఏవండీ... లేవండి త్వరగా! ఆఫీసుకి టైమవుతోంది. లేచి రెడీ అవ్వండీ!" అని దీర్ఘాలు తీస్తూ కప్పుకున్న దుప్పటిని లాగేసింది.

నిద్రమత్తో, రాత్రి మత్తో... అదింకా వదల్లేదా పురుషపుంగవుడికి. ఇటు నుంచి అటు తిరిగి పడుకుంటూ 'ప్లీజ్ లక్ష్మీ ఈరోజెందుకో ఒంట్లో బాలేదు. ఆఫీసుకి వెళ్లాలన్పించట్లేదు. లీవు పెట్టేస్తాను. కాసేపు పడుకోనీ నన్ను!" అన్నాడు మత్తుమత్తుగా.

"ఏమిటీ... ఆఫీసుకి వెళ్లరా??" కొంపలు మునిగినట్లుగా గాబరాపడుతూ అరిచింది.

"అబ్బా... అంత గట్టిగా అరవకే... దడుచుకొని ఛస్తాను. వెళ్లి నీ పనిచూసుకో! నా జోలికి రాకు.... పడుకోని నన్ను!" విసుగ్గా అన్నాడు.

శ్రీలక్ష్మి ఏదో గుర్తొచ్చినట్లుగా నెమ్మదిగా అతడి పక్కకు చేరి గొంతు తగ్గించి అతడి చెవిలో... "మా వారూ బంగారు కొండా... త్వరగా ఆఫీసుకి బయల్దేర్రారు కదా..." అంటూ ఏదో సినిమాలోని పాటని రాగం తీస్తూ మార్చి పాడింది.

"ఊహూ...నే వెళ్లను లక్ష్మీ!" మారాం చేస్తున్నట్లుగా గారాలు పోతూ అన్నాడు.

"అలాగంటే ఎలాగండీ.... ఒంట్లో బాగానే వుంది కదా! ప్లీజ్...నా మాట వినండి! రేపెట్లాగూ ఆదివారమేగా...ఇంటిపట్టునే వుండొచ్చు. మా శ్రీవారు చాలా మంచివారు కదా...నే చెప్పిన మాట వింటారు కదా...ప్లీజ్ లేవండీ టైమవుతోందీ!" అతడి గడ్డం పట్టుకొని బుజ్జగించే ధోరణిలో అంది.

"ఆదివారమైతే మాత్రం ఏం ప్రయోజనం? ఆ దిక్కుమాలిన ఛానెల్స్‌లో 'ఆదివారం స్పెషల్ ప్రోగ్రాం' అంటూ రోజంతా టీవీ ముందే కూర్చుంటావ్... కనీసం నేను చెప్పేది కూడా వినిపించుకునే తీరిక నీకు దొరకదాయే! ఏంటో భార్యాభర్తలుగా ఒకే గూటి కింద కాపురం చేస్తున్నామే కానీ మనం మనసులు విప్పి మాట్లాడుకునే టైమే దొరకడం లేదు. ఏది ఏమైనా సరే... ఈ రోజు ఆఫీసుకెళ్లను. పగలంతా నీతోనే గడుపుతాను. సాయంత్రం ఏ సినిమాకో... షికారుకో... సరేనా? ప్లీజ్... నా ముద్దుల శ్రీమతివి కదూ...వెళ్లనీయకూ...నను వెళ్లనీయకూ!" తనూ ప్రాధేయపూర్వకంగా అడిగాడు లేచి కూర్చుని...

శ్రీలక్ష్మిలో దిగులు, ఆరాటం, ఆత్రుత, టెన్షన్... పెట్రోల్ డీజిల్ రేట్లలా క్షణక్షణానికి పెరిగిపోతున్నాయ్. 'వంట చెయ్యాలి, ఇల్లూడవాలి, బట్టలుతకాలి, ఆపై... అమ్మో... ఈయన ఆఫీసుకి వెళ్లకపోతే ఎలా? కుదరదు"

"ఏవండేవండేవండీ.... మీరు మాట్లాడేదేదో తీరిగ్గా ఆఫీసు నుంచి వచ్చాక మాట్లాడుదురు కానీ! రాత్రి నిద్ర పోయే ముందు మీరు చెప్పేవన్నీ వింటూ పడుకుంటాలెండీ! ప్లీజ్... ముందు మీరు మంచం దిగి బాత్రూంలోకి దూరండి... అవతల టైమైపోతూ వుంది!" బలవంతంగా అతడి భుజాలు పట్టుకుని లేపింది.

"అప్పుడే ఆఫీసుకి టైమైపోవడమేమిటి... నీ పిచ్చిగానీ! ఛీ...ఛీ.... కట్టుకున్న భార్యతో కనీసం ఒక్కరోజైనా మనస్ఫూర్తిగా గడిపే భాగ్యానికి కూడా నోచుకోని బతుకైపోయింది నాది!" విసుగ్గా గొణుక్కుంటూ అయిష్టంగానే బాత్రూం వైపు అడుగులు వేశాడు. లక్ష్మీ విజయగర్వంతో వుప్పొంగిపోతూ జింకపిల్లలా కిచెన్‌లోకి పరుగు తీసింది. పావుగంటకోసారి టైమ్ చూసుకుంటూ పనులన్నీ యమస్పీడుగా పూర్తిచేయసాగింది.

భర్తని ఆఫీసుకి పంపించి (నెట్టేయ) గానే తలుపులు బిగించి లోపల గడియపెట్టేసుకుంది. ఆ తర్వాత గబగబా వెళ్లి టీవీ స్విచాన్ చేసి రిమోట్ తీసుకొని సోఫాలో జారగిలబడుతూ... కాలేజీ అమ్మాయి సెల్‌ఫోన్‌లో ఎస్ ఎం ఎస్ టైప్ చేసినంత స్పీడుగా రిమోట్‌తో చకచకా ఛానెల్స్ మారుస్తూ తన కిష్టమైన 'జనని' చానెల్ సెట్ చేసుకొని టైటిల్ సాంగ్‌తో అప్పుడే మొదలైన తన ఫేవరేట్ సీరియల్‌ను సీరియస్‌గా చూడసాగింది.

***

**శ్రీలక్ష్మిలో దిగులు, ఆరాటం, ఆత్రుత, టెన్షన్... పెట్రోల్ డీజిల్ రేట్లలా క్షణక్షణానికి పెరిగిపోతున్నాయ్. 'వంట చెయ్యాలి, ఇల్లూడవాలి, బట్టలుతకాలి, ఆపై... అమ్మో... ఈయన ఆఫీసుకి వెళ్లకపోతే ఎలా? కుదరదు"**

లంచ్ టైమయ్యింది!

అప్పటి దాకా ఆఫీస్ వర్క్‌తో బాగా అలసిపోయి, టేబుల్ మీదున్న ఫైల్సన్నీ ఓ పక్కకి సర్ది రిలాక్స్‌డ్‌గా సీట్లో వెనక్కి జారగిలబడ్డట్టుగా కూలడ్డాడు... సుబ్బారావు.

మిగతా కొలీగ్స్‌లో కొందరు క్యాంటీన్ వైపు వెళుతుంటే... లంచ్ బాక్స్ తెచ్చుకున్న మరికొందరు తమ తమ టేబుళ్ల ముందు కూర్చొని లంచ్‌కి ఉపక్రమిస్తున్నారు.

సుబ్బారావు కూడా తన బాక్స్ ముందు పెట్టుకున్నాడు కానీ... అలసటగా అనిపించి కొద్దిసేపు అలాగే కూర్చుండిపోయాడు. ఆ తర్వాత భార్యతో కాసేపు సరదాగా మాట్లాడ్తే వుల్లాసంగా వుంటుంది అనిపించి జేబులోంచి మొబైల్ ఫోన్‌ని చేతిలోకి తీసుకున్నాడు.

ప్రైవసీ కోసం సీట్లోంచి లేచి, గది మూలకి నడిచి భార్య మొబైల్ ఫోన్ నెంబర్ డయల్ చేసి ఫోన్‌ని చెవి దగ్గర వుంచుకుంటూ అవతల్నుంచి వినిపించే రిప్లయ్ కోసం ఆత్రంగా ఎదురుచూడసాగాడు.

వారం రోజుల క్రితం కొన్న మొబైల్ ఫోనది!

'బీటా-గుండికామ్' కంపెనీ తరపున ' ఒక్కసారి మొబైల్ కొంటే ఎటువంటి రీఛార్జి లేకుండా రెండేళ్ల వరకూ ఇన్‌కమింగ్ కాల్స్ ఫ్రీ'! అంటూ దక్షిణాది పాపులర్ హీరోయిన్ 'మిష' నెల్రోజుల్నుండి టీవీలో తన ముద్దు ముద్దు మాటల్తోనూ, సిటీలోని అన్ని సెంటర్లలోనూ పెద్ద పెద్ద హోర్డింగుల్లో అందమైన ఫోజులిస్తూ ఇస్తున్న అడ్వర్‌టైజ్‌మెంట్ చూసి 'టెంప్ట్' అయిపోయిన సుబ్బారావు ఆ కంపెనీ మొబైల్ ఫోన్ కొనకుండా వుండలేకపోయాడు.

అంతే కాదు అదేదో రీఛార్జ్ వోచర్ వేసుకుంటే 'మొబైల్ టు మొబైల్ ఫ్రీగా మాట్లాడుకోవచ్చు' అని ఆ షాపు వాడు చెబితే... ఒకటి కాదు, రెండు ఫోన్లు కొన్నాడు. 'ఒకటి ఇంట్లో భార్య దగ్గర వుంచితే- తను బయటకు ఎక్కడికి వెళ్లినా... భార్యతో మాట్లాడాలని అనిపించినప్పుడల్లా సరదాగా, ఎంతసేపైనా ఫ్రీగా ఫోన్‌లో మాట్లాడుకోవచ్చు' అని అతడి ఐడియా

కానీ, అదేం విచిత్రమో... వారం క్రితం ఆ ఫోన్లు కొన్నప్పటి నుంచీ అతడు బయట నుంచి ఇంట్లో వున్న భార్యకి ఎన్నిసార్లు ఫోన్ చేసినా... అతడు అడిగిన వాటికి ఒకట్రెండు మాటల్లో ముక్తసరిగా బదులిచ్చి ఫోన్ కట్ చేస్తుందే కానీ... అతడూహించినట్టుగా సరదాగానో, సరసంగానో ఆమె ఏమీ మాట్లాడడం లేదు.

ఇప్పుడైతే... అవతలి వైపు నుంచి బదులే లేదు. ఎన్నిసార్లు లైన్ కలిపినా అతవలి వైపు నుంచి ఫోన్ రింగవుతున్న చప్పుడు తప్ప ఫోన్ మాత్రం లిఫ్ట్ కావడం లేదు.

ఆఫీసు రూంలో ఓ మూలన చేరి మాటి మాటికి రింగ్ చేస్తూ అతడు వ్యక్తం చేస్తున్న అసహనపు నిట్టూర్పులు వింటూ మిగతా స్టాఫ్‌ంతా అతడి వంక వింతగా, ప్రశ్నార్థకంగా చూడసాగారు.

వాళ్ల చూపుల బాణాలకి సుబ్బారావులో కలిగిన ఇరిటేషన్... సమ్మర్‌లో టెంపరేచర్‌లాగా క్షణక్షణానికి పెరిగిపోసాగింది.

'ఇదే ఆఖరు సారి!' అని మనసులో గట్టిగా నిర్ణయించేసుకొని, భార్య నెంబర్ డయల్ చేశాడు.

చిత్రం... ఈసారి అవతలి వైపు ఫోన్ లిఫ్టయ్యింది.

అంతే... చుట్టూ అందరూ తననే చూస్తు, తన మాటలే వింటున్నారన్న ఆలోచన కూడా రాలేదతనికి... "ఏయ్... ఏమైంది నీకు? బుద్ధుందా అసలు? ఎంత సేపట్నుంచీ ఫోన్ చేస్తున్నానో తెలుసా? ఏమైపోయావ్... ఏం చేస్తున్నావింత సేపు? ఒక్కసారైనా..." అంటూ సునామీలో దూసుకొచ్చిన సముద్రపు నీరులా అతడిలోని కోపం, అసహనం ఒక్కసారిగా పొంగుకొచ్చాయి.

అయినా... వాటికి అడ్డుకట్ట వేసేందుకు అవతలి వైపు నుంచి ఏమాత్రం ప్రయత్నించలేదామె. అతడి వాక్ప్రవాహమంతా ఆగిపోయి, అతడు ఆయాసపడుతుంటే తాపీగా బదులిచ్చింది....

" ఎందుకండీ అంత కోపం? ఈ టైంలో 'టీ టీవీ' ఛానల్‌లో 'రశ్మి' సీరియల్ వస్తుందండీ! ఒక్కక్షణం కూడా కళ్లు తిప్పుకోలేనంత అద్భుతంగా వుంటుందనుకోండి! ప్రతి రోజూ మీరిదే టైమ్‌కి ఫోన్ చేసి డిస్టర్బ్ చేస్తున్నారని- ఈరోజు మొబైల్ ఫోన్‌ని 'వైబ్రేషన్ మోడ్'లో వుంచేశాను. అందుకే రింగైన చప్పుడు విన్పించలేదు. అంతే ! ఇందాకే ఆ సీరియల్

అయిపోయింది. ఇప్పుడు ఫోన్ లిఫ్ట్ చేశాను కదా... ఈ మాత్రానికే అంత కోపమెందుకండీ? కాస్త ఓపిక పడితే సరిపోయేదిగా?''

చుట్టూ వున్న అందరూ తననే చూస్తున్నారని తెలుసుకోవడం వల్లో, లేక భార్యతో సరదాగా మాట్లాడాలనుకొని, తనకు తెలీకుండానే మూడ్ పాడు చేసుకున్నానని జ్ఞానోదయం కలగడం వల్లో వెంటనే తనను తాను కంట్రోల్ చేసుకుంటూ...''అది కాదు స్వర్ణా... అసలు...'' అంటూ మామూలుగా మాట్లాడ్తూ కబుర్లలోకి దిగబోయాడు.

కానీ...

''సరే... అడ్వర్‌టైజ్‌మెంట్లన్నీ అయిపోయాయి. ఇప్పుడే ''ముద్దబంతి పువ్వులు'' సీరియల్ మొదలైంది.... నేను ఫోన్ పెట్టేస్తున్నాను. మధ్యలో మళ్లీ ఫోన్ చేయకండి. ఏదైనా అర్జెంట్‌గా మాట్లాడాల్సింది వుంటే మీరు ఆఫీసు నుంచి వచ్చాక మాట్లాడుకుందాం... సరేనా? బై...'' అంటూ అతడి రెస్పాన్స్ కూడా వినిపించుకోకుండా అవతలి వైపు నుంచి లైన్ కట్టయింది.

సుబ్బారావులో అసహనం, కోపం తిరిగి నసాళానికి చేరుకున్నాయి. ''ఛీ...'' అంటూ చేతిలోని ఫోన్‌ని నేలకేసి విసిరికొట్టబోయే వాడే! కానీ ఎందుకో... ఆఖరి నిమిషంలో ఆ ఫోన్‌కి సంబంధించిన అడ్వర్‌టైజ్‌మెంట్లోని హీరోయిన్ 'మిష' అందమైన ఆకారం కళ్ల ముందు కనిపించి ఆగిపోయాడు.

ఛీ... పెళ్లాంతో కనీసం సరదాగా మాట్లాడే అదృష్టానికి కూడా నోచుకోని దిక్కుమాలిన బతుకైపోయింది. నాది'' అని గొణుక్కుంటూ తన సీట్లోకొచ్చి కూలబడ్డాడు సుబ్బారావు.

లంచ్ కూడా చేయాలన్పించలేదు... అయిష్టంగానే తిరిగి ఆఫీస్ వర్క్‌లో తల దూర్చాడు.

***

ఒక్కసారిగా సోఫాలో కూలబడిపోయింది ప్రతిమ.

తల భారంగా వెనక్కి వాల్చింది. మనసంతా నిస్తేజంగా, నిర్లిప్తంగా అయిపోయింది. లోకమంతా శూన్యంగా ఒంటరిగా, విషాదంగా కన్పిస్తోందామెకి.

''నిజంగా మానవ సంబంధాలెంత విచిత్రమైనవో కదా...!'' అన్పించింది. మనుషుల మధ్య బంధాలు ఇంత కఠినంగా, దారుణంగా గుండెల్ని పిండేస్తాయా? మనుషులూ – మమతలూ, బంధాలూ, అనుబంధాలూ, ఆత్మీయతలూ–అనురాగాలూ అదృశ్యంగా వుంటూ ప్రత్యక్షంగా ఇంతటి ఆందోళననీ, ఆవేదననీ కలిగిస్తాయా...?'' నమ్మబుద్ధి కావడం లేదామెకి. కానీ ప్రస్తుతం తను అలాంటి స్థితిలోనే వుండి, ప్రత్యక్షంగా ఆ పరిస్థితిని అనుభవిస్తుంటే మాత్రం నమ్మక తప్పటం లేదు.

ప్రతిమ ఆలోచనా పరంపర అనంతంగా సాగిపోతోంది....

''మరణం ఎంత విచిత్రమైనది?! ఒకరికి భవబంధాల నుంచి విముక్తి కలిగించి, ఎంతోమందికి ఎంతటి దుఃఖాన్ని విషాదాన్ని మిగులుస్తుందో ఇప్పుడిప్పుడే అర్థమౌతోంది తనకు''

తన దగ్గర బంధువుల్లో ఎవరూ చనిపోయినా ఇప్పటి వరకూ తానెప్పుడు ఇంతలా చలించలేదు. అన్నిటికంటే ఎక్కువ విషాదమేమిటంటే... తను ఇంతటి దుఃఖానికి గురైన సమయంలో తనని ఓదార్చేందుకు, తనకు మానసికంగా ఆసరా ఇచ్చేందుకు ఇంట్లో కనీసం ఒక్కరు కూడా లేకపోవడం!


నిజంగా ఇటువంటి దుస్థితి పగవారిక్కూడా రాకూడదు!

విషాద భావ వీచికలు ప్రతిమని నిలువునా కమ్మేస్తుంటే... బాధనంతా పంటిబిగువున అణచుకునే ప్రయత్నంలో భారంగా కళ్లు మూసుకుంది. కనుకొలకుల్లోంచి చెక్కిళ్లపై జలజలా జారిన కన్నీళ్లు ఆవేదనతో రగిలిపోతున్న మనసుని కాసింత చల్లబరిచినట్లుగా అనిపించింది.

అప్పుడు... సరిగ్గా అప్పుడే ఫోన్ మోగింది. సోఫా పక్కనే వున్న టెలిఫోన్!

అతికష్టమ్మీద లేచి, రిసీవరెత్తి ''హలో...'' అంది కీచుగొంతుతో..

''ప్రతిమా! నేను...నేను వనజని!'' అంటూ ఆ తర్వాత మాట పెగలక బావురుమంది వనజ అవతల్నించి.




''వూరుకో వనజా...వూరుకో!'' ఓదార్పుగా అంది ప్రతిమ

''ప్రతిమా! ఇక్బాల్... ఇక్బాల్ చనిపోయాడు చూశావా?...'' మళ్లీ భోరుమంది వనజ.

''అవును ఇందాకే జీడిపాకం సీరియల్ చూశాను. నేను...నేను కూడా తట్టుకోలేకపోతున్నా...'' గుండెల్లోంచి తన్నుకొచ్చిన దుఃఖం ప్రతిమ మాటని మింగేసింది.

అవతల్నుంచి ఫోన్‌లో గుండెలవిసేలా ఏడుస్తోంది వనజ.

'అసలే వనజ తనకంటే సెన్సిటివ్! తనకే ఇంతటి దుఃఖం కలిగితే ఇక వనజ మానసిక పరిస్థితి ఎలా వుందో ఊహించడం కష్టం! ఇలాంటి సమయంలో తానే ధైర్యంగా వుండి వనజని ఓదార్చాలి' అనుకుంటూ మనసులోని బాధని అతి కష్టమ్మీద అదిమిపెట్టి తనకు తాను కంట్రోల్ చేసుకుంటూ వనజని ఓదార్చసాగింది ప్రతిమ.

''ఊరుకో వనజా! ప్లీజ్... కంట్రోల్ యువర్ సెల్ఫ్! నువ్వసలే సెన్సిటివ్.... తొందరపడి ఎలాంటి అఘాయిత్యానికి పూనుకోవద్దు. 'మరణం' అనేది అందరినీ ఎప్పుడో ఒకప్పుడు వరిస్తుంది. దాన్నుంచి ఎవరూ తప్పించుకోలేరు. ఈ రోజు జీడిపాకం సీరియల్‌లో అది ఇక్బాల్‌ని వరించింది.... రేపు నన్నూ, నిన్నూ కూడా వరిస్తుంది. ఒక్క విషయం మాత్రం గుర్తుపెట్టుకో... ఏదో ఒక రోజు మనమందరమూ వెళ్లిపోవాల్సిన వాళ్లమే... కాకపోతే కాస్త ముందూ వెనుకలుగా వెళ్తాం... అంతే! ప్లీజ్...''

వనజకి ధైర్యం చెప్పాలని పూనుకుంది. కానీ అంతకంటే ఎక్కువ బాధ తన గొంతుని పూడ్చేయడంతో మాట పెగలక లోలోపలే కుమిలిపోసాగింది ప్రతిమ.

అవతల్నుంచి మాత్రం... కుండపోతగా కురుస్తున్న వర్షంలా వనజ ఏడ్పు వినిపిస్తునే వుంది.

''వనజా... నా మాట విను... ఊరుకో! ఇక్బాల్ మరణం నినూ నన్నే కాదు మనలాంటి తెలుగాడపడుచులందరినీ ఎంత బాధపెట్టిందో ఆ ప్రొడ్యూసర్, డైరక్టర్లకి అర్థం కాకపోదు. వాళ్లూ మనుషులేగా... వాళ్లకి మనలాగే మనసనేది వుంటుందిగా? ఈ సీరియల్ ఎంత లేదన్నా మరో రెండు సంవత్సరాలైనా వస్తుంది కాబట్టి ఏదో విధంగా మళ్లీ ఇక్బాల్‌ని మన ముందుకు తీసుకొస్తార్లే వనజా... నువ్వూరుకో!'' తన శాయశక్తులా వనజని ఓదార్చేందుకు ప్రయత్నిస్తోంది ప్రతిమ

''ప్రతిమా! అసలు....అసలు... ఇక్బాల్ చనిపోతాడని నేననుకోలేదు! వెంటనే హాస్పిటల్‌కి తీసుకెళ్తారేమో, ఆపరేషన్ చేసి బ్రతికిస్తారేమో అనుకున్నాను....ప్చ్!'' వెక్కిళ్ల మధ్య అంది వనజ.

''ఊరుకో వనజా... ఏం చేస్తాం? ఏదీ మన చేతుల్లో లేదు. ఆ ప్రొడ్యూసర్, డైరక్టర్లు మనకేదైనా న్యాయం చేస్తారన్న నమ్మకం నాకుంది వూరుకో... ప్లీజ్...''

ఈ ఏడ్పూ, ఓదార్పుల పరంపర 'తెలుగు టీవీ సీరియల్స్'లా అలా సా..గు..తూ..నే.. వున్నాయి.